సామాన్యులకు అందని చేప

- సమృద్ధిగా లభ్యం... ధర అధికం
- రెండేళ్లలో రెండింతలు



మలికిపురం చేపల మార్కెట్‌లో చందువా తదితర సముద్ర చేపలు

మలికిపురం: చేపల ధరల సామాన్యులకు భారంగా మారుతున్నాయి. చెరువులు, సముద్రం, గోదారి చెంతనే ఉన్నా స్థానికులకు చౌకగా దొరకడం లేదు. వాటి ధరలు నానాటికీ ఆకాశాన్నంటుతున్నాయి. గడిచిన రెండేళ్లలో చేపల ధరలు అమాంతం పెరిగి పోయాయి. చెరువు చేపలతో పాటు, గోదావరి, సముద్రం చేపలు కూడా అదే దారిలో సాగుతున్నాయి. మాంసాహార ప్రియులను లొట్టలే యించే కొయ్యింగ చేపలు ప్రస్తుత సీజన్‌లో గోదారిని ముంచెత్తుతున్నాయి. గోదావరికి సీజన్‌లకు అతీతంగా ఎల్లప్పుడూ కొయ్యింగలు అధికంగా వస్తున్నాయి. ఏడాది క్రితం వరకూ కేజీన్నర బరువు లోపే అడపాదడపా మత్స్యకారులకు లభించే ఈ చేప ప్రస్తుతం మూడు నుంచి నాలుగు కేజీల బరువు వరకూ అధిక సంఖ్యలో లభిస్తున్నాయి. చేప సైజు భారీగా ఉండడంతో పాటు ధర కూడా అధరగొడుతోంది. రెండేళ్ల క్రితం వరకూ ఈ చేప కేజీ ధర రూ.200 ఉండేది. ప్రస్తుతం కేజీ ధర రూ.400 ఉంది. కొయ్యింగ చేప గోదావరిలోనే పెరిగి పెద్దదవుతుంది. ఇది కూడా పులస చేపలానే సముద్రం నుంచి గోదావరిలోకి ప్రవేశించి ఇక్కడ మంచినీటిలో జీవిస్తుంది. సంతానం కూడా అభివృద్ధి చేసుకుంటుంది. పులస వలే ఇది కూడా గోదావరిలో పెరగడం వల్లనే రుచి వస్తుంది. సాధారణంగా ఈ చేప మత్స్యకారులకు వలలో చిక్కిన వెంటనే మార్కెట్‌కు కూడా రాకుండానే మార్గంమధ్యలో అమ్ముడైపోతాయి. ఈ చేపకు అంత గిరాకీ. ఇక వరద సీజన్‌లో లభించే గోదావరి పులస పుస్తెలమ్మినా కొనలేం. పులసలకు సమానంగా ఒడిశా పులసలు మార్కెట్‌లోకి రావడంతో పులస ప్రియులు తక్కువ రేట్లకే పులసలు కొనుగోలు చేసి సంతృప్తి చెందుతున్నారు. అలాగే పండుగొప్ప, మాగ, మాచిప్ప, చందువా చేపల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. పండుగొప్ప ధర ఏకంగా కేజీ రూ.500 పలుకుతుంది. చందువా ధర కేజీ రూ.600 ఉంది.

ఆహారం ఇదీ.. అందుకే వీటికి రుచి

సముద్రం నుంచి వచ్చే పండుగొప్ప, కొయ్యింగ, పులస చేపలు సముద్రంలోనే పుడతాయి. ఆహారం కోసం గోదావరి పాయల ద్వారా పయనిస్తాయి. గోదావరిలో మట్టిపై నుండే మెత్తని పార, గోదావరిలో పెరిగే చీరమేను, నాచు, నీటిపై తేలియాడే నురగను ఇవి ఆహారంగా తీసుకుంటాయి.. ఇలా ఇవి తీసుకునే ఆహారం వల్లనే ఇంత అమితమైన రుచి వస్తుంది. దీంతో ఈ చేపల రుచిని సామాన్య, మధ్య తరగతి ప్రజలు చూడ లేకపోతున్నారు. ఐదేళ్ల క్రితం రూ.50 రూపాయలకు వచ్చే చేపలు, ఈ రోజు రూ.500కు కొనాల్సిన దుస్థితి. మధ్యతరగతి ప్రజలు స్థితి ఇలా ఉంటే, ఇక ఉపాధి కూలీలు, చిన్న పాటి వ్యాపారులు, చేతి వృత్తుల వారు అసలు మార్కెట్ వైపు చూసే స్థితి లేదంటున్నారు. ఇక చెరువు చేపల పరిస్థితి పరిశీలిస్తే ఏడాది క్రితం కేజీ రూ.80 ఉండే శీలావతి, మోసు, దడ్డువాయి, గడ్డి చేపల ధరలు ప్రస్తుతం రూ.120 దాటింది. 100 కౌంట్ రొయ్య ధర కూడా కేజీ రూ.200 పై బడింది.

నాణ్యత, ధరల నియంత్రణపై కొరవడిన పర్యవేక్షణ

అటు చేపల నాణ్యత, ధరల నియంత్రణపై ప్రభుత్వాధికారులకు శ్రద్ధ లేదు. మార్కెట్లలో చేపల విక్రయాలకు అనుమతి ఇచ్చి, పన్నుల వసూలు చేసుకునే పంచాయతీలు ఆరోగ్యవంతమైన చేపలు విక్రయిస్తున్నారో లేదో అనే విషయాలను పర్యవేక్షించడం లేదు. చనిపోయిన, కుళ్లిన చేపల విక్రయాలే మార్కెట్‌లో సాగుతున్నాయి. ఫలితంగా వినియోగదారులు నష్టపోతున్నారు.

> **శ్రద్ధ పెట్టాలి**
>
> 
>
> గ్రామాల్లో జరిగే చేపల మార్కెట్లపై ఆయా పంచాయితీలు శ్రద్ధ పెట్టాలి. కుళ్లిన చేపల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నాణ్యతతో కూడిన చేపల విక్రయాలని ప్రోత్సహించి వినియోగదారుల ఆరోగ్యాన్ని కాపాడాలి.
>
> – మాలే శ్రీనివాస్‌నగేష్, వినియోగదారుల సంఘ నాయకులు

విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి



అంబాజీపేటలో విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్, విద్యుత్ శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య లేకుండా అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ వైర్లు కిందకు వేలాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి వాటి స్థానే నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సబ్ ఇంజినీర్ కె.మోహన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, విద్యుత్ శాఖ ఎల్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలను సమష్టిగా అడ్డుకుందాం

మామిడికుదురు: బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పి.గన్నవరం సీడీపీఓ వై.విజయశ్రీ పేర్కొన్నారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాసంలో భాగంగా మండల స్థాయి శిక్షణ సమావేశం జరిగింది. బేటీ బచావో–బేటీ పఢావోలో భాగంగా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి సీడీపీఓ అధ్యక్షత వహించారు. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంత్ మాట్లాడుతూ నాగరిక సమాజంలో కూడా బాల్య వివాహాలు జరగడం దారుణమన్నారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీఓ ఉమాలక్ష్మి, అధ్యాపకురాలు ఝాన్సీరాణి, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

బెల్లపుఊట ధ్వంసం

కొత్తపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సుమారు 1600 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేసినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు. స్థానిక శీలంవారిపాలెం, బాబానగర్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి సారా తయారీకి భూమిలో ఊరబెట్టిన సుమారు 1600 లీటర్ల బెల్లపుఊటను గుర్తించారు. దానిని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణ భూమి స్వాధీనం



రాజోలులో దేవస్థానం భూమి ఆక్రమణదారుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానానికి చెందిన ఆక్రమణ భూమిపై వచ్చిన ఫిర్యాదు మేరకు, ఎండోమెంట్స్ సహాయ కమిషనర్ ఆదేశాలపై సదరు సిబ్బంది దేవస్థానానికి యథాస్థితిని తీసుకువచ్చిన వైనమిది. వివరాలు మంగళవారం ఏసీ వి.సత్యనారాయణ మీడియాకు తెలిపారు. రాజోలులో సర్వే నంబరు 203–2లో 0.32 సెంట్లు దేవస్థానం భూమిలో అక్రమ కట్టడాలు జరుగుతున్నట్టుగా ఫిర్యాదు వచ్చిందన్నారు. దీనిపై ఏసీ ఇచ్చిన ఆదేశాలతో దేవస్థానం సిబ్బంది, ఎండోమెంట్స్ తనిఖీదారు సదరు భూమి వద్దకు వెళ్లి, కట్టడానికి పిల్లర్లు వేసేందుకు ఏర్పాటు చేసిన ఐరన్ బుట్టలను, ఐరన్ కట్టుబడిని భూమి సాగు చేస్తున్న రైతుతో తొలగింప చేసి, భూమిని యథాస్థితికి తెచ్చారు. కాగా దేవస్థానం అనుమతి లేకుండా ఏ ఇతర కట్టడాలు జరిపినా సెక్షన్ 83–2 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులు పాజిటివ్ దృక్పథంతో ఉండాలి

అంబాజీపేట: రాబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పాజిటివ్ దృక్పథంతో ఉండి తమ లక్ష్యాలను నిర్ణయించుకోవాలని బీవీసీ అక్షర ఐఐటీ స్కూల్, జూనియర్ కాలేజ్ అధ్యాపకులు యక్కలదేవర సురేష్‌కుమార్ అన్నారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం పీవీ.కేశవాచార్యుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ తరగతులను మంగళవారం నిర్వహించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాబోయే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర పూజలు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామివారిని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఏడు వారాల నోము, నిత్య కల్యాణం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారి దర్శనం అనంతరం అన్నప్రసాదం స్వీకరించారు.

నేడు ఆలయంలో హుండీల నగదు లెక్కింపు

వేంకటేశ్వరస్వామివారి ఆలయ హుండీలను బుధవారం తెరిచి నగదు లెక్కించనున్నట్టు దేవదాయ–ధర్మదాయ శాఖ డీసీ, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి గ్రామస్తులు, దాతలు, భక్తులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో హుండీలు తెరిచి స్వామివారికి మొక్కుల రూపంలో భక్తులు సమర్పించిన నగదు, ఇతర వస్తువులను లెక్కించనున్నట్టు డీసీ అండ్ ఈఓ తెలిపారు.

రేపు జాబ్ మేళా

రాజోలు: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.సాయిబాబు మంగళవారం తెలిపారు. నాలుగు కంపెనీలకు చెందిన ప్రతినిధులు జాబ్ మేళాలో పాల్గొంటారన్నారు. ఏపీఎస్‌ఎస్‌డీసీ జిల్లా అధికారి డి.హరిశేషు ఆధ్వర్యంలో 100 మంది నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన చేసేందుకు ప్రణాళిక రూపొందించారన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ చదివిన వారంతా జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు.

రావులపాలెం ఎస్సైగా రాము

రావులపాలెం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్సైగా ఎన్.రాము మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మారేడుమిల్లి నుంచి బదిలీపై రాము ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు టౌన్ సీఐ శేఖర్‌బాబు, ఎస్సై చంటి తదితరులు అభినందనలు తెలిపారు.

ముంపు సమస్య పరిష్కారం కోరుతూ నిరసన



పాశర్లపూడిబాడవలో నిరసన తెలుపుతున్న రైతులు

మామిడికుదురు: ముంపు నీరు రోజుల తరబడి పంట పొలాల్లో నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీంతో పంట సాగు చేసేందుకు అవకాశం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ పాశర్లపూడిబాడవ రైతులు మంగళవారం నిరసన తెలిపారు. సుమారు 200 ఎకరాల్లో పంట ముంపు సమస్యను ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలాకాలం నుంచి ఇదే సమస్య నెలకొందని వాపోయారు. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఓఎన్జీసీ నిర్వాకం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. 20 ఏళ్ల క్రితం పంట పొలాల మధ్యలో ఓఎన్జీసీ రోడ్డు నిర్మించిందని, దీని వల్ల ముంపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుందన్నారు. సుదీర్ఘ కాలం నుంచి ఈ సమస్య పరిష్కారానికి మోక్షం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో సారవంతమైన పంట పొలాలు ఎందుకూ పనికి రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములు అమ్ముకునేందుకు కూడా పనికి రావడం లేదన్నారు. ముంపు నీరు దిగేందుకు డ్రైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సిద్దవటం యానాదయ్య

మామిడికుదురు: తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కడపకు చెందిన సిద్దవటం యానాదయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అప్పనపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి దేవస్థానం కల్యాణ కట్టలో పని చేస్తున్న వారిలో వయస్సు మీరిన వారిని, సక్రమంగా విధులకు హాజరు కాని వారిని తొలగించి 24 మందిని విధుల్లోకి తీసుకున్నారన్నారు. అప్పటి ట్రస్టు బోర్డు, ఎండోమెంట్స్ కమిషనర్, ఇతర దేవదాయ శాఖ అధికారుల నిర్ణయం మేరకు ఈ ఒప్పందం జరిగిందన్నారు. ఇందులో తన ప్రమేయం ఎంత మాత్రం లేదన్నారు. కానీ అనర్హులుగా గుర్తించి తొలగించిన పది మందితో తనపై తప్పుడు ఫిర్యాదు చేయించారన్నారు. టీడీపీ అధినేతల ఒత్తిడితో తనను ఏ–1గా పేర్కొంటూ కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యవర్తిగా వివాదం పరిష్కరించేందుకు వచ్చిన తనపై ఏ విధంగా కేసు నమోదు చేస్తారని యానాదయ్య ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే అక్రమ కేసులు నమోదు చేసి వేధించడం కాదని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని దేవాలయాల్లో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25 వేల వేతనం, శాశ్వత ఉద్యోగాల కల్పన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పశువులకు ఉచిత సేవలు



అప్పనరామునిలంకలో బ్రోచర్ విడుదల చేస్తున్న సర్పంచ్ సుబ్బరాజు

మామిడికుదురు: ఈదరాడ గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి ప్రారంభించారు. రాజోలు పశు సంవర్ధక శాఖ ఏడీ రవికుమార్, మండల పశు వైద్యాధికారి చేగొండి శ్రీరామ్ 30 పశువులకు చూడి పరీక్షలు, నట్టల నివారణ మందును అందించారు. అనారోగ్యంతో ఉన్న పశువులకు ఉచితంగా మందులు అందించారు. పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సచివాలయ ఉద్యోగులు, రైతులు ఈ శిబిరంలో పాల్గొన్నారు.

అప్పనరామునిలంకలో..

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంకలో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా పశువులకు వ్యాధులను నివారించుకోవచ్చని అన్నారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎస్.వెంకటేశ్వరరావు, పశువైద్యాధికారి కె.సునీల్ గాంధీ, నాయకులు బర్రే శ్రీను, గుబ్బల సూర్యనారాయణ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుబ్బలపాలెంలో..

మలికిపురం: గుబ్బలపాలెంలో మంగళవారం లక్కవరం పశువైద్య శాల అధికారులతో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ చెల్లుబోయిన శేషారత్నం శిబిరం ప్రారంభించారు. గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 135 కోళ్లకు నట్టల నివారణ మందులు అందించారు. మండల ఉపాధ్యక్షురాలు కందికట్ల నిర్మల, మండల పశు వైద్యాధికారి పి.సూర్యనారాయణ రాజు, కె.లక్ష్మణరావు, కె.సుమంత్ రాజబాబు పాల్గొన్నారు.

గర్భిణులు, వృద్ధులకు ఉచిత ఆటో సేవలు



ఆటోకు పూజ చేస్తున్న దుర్గబాబు

మామిడికుదురు: పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్ నుంచి పాశర్లపూడిలంక, బాడిలంక గ్రామాలకు ఉచిత ఆటో సేవలను దాత అందుబాటులోకి తీసుకువచ్చారు. పాశర్లపూడిలంకకు చెందిన బొరుసు దుర్గబాబు ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉచిత సర్వీసు కోసం తన సొంత నిధులు రూ.4 లక్షలతో ఎలక్ట్రికల్ ఆటో కొన్నారు. దానికి డ్రైవర్‌ను ఏర్పాటు చేశారు. కొండాలమ్మ చింత సెంటర్ నుంచి పాశర్లపూడిలంక, బాడిలంక తీసుకు రావడం అక్కడి నుంచి మళ్లీ కొండాలమ్మ చింత సెంటర్ వరకు అన్ని సేవలు ఉచితమే. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ఆటోకు పూజలు చేసి సేవలను ప్రారంభించారు. తమ గ్రామానికి ఆర్టీసీ సర్వీసు అందుబాటులో లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దుర్గబాబు తెలిపారు. ప్రయాణికులకు అవస్థలను తొలగించాలన్న ఉద్దేశంతోనే ఉచిత సర్వీసు ఏర్పాటు చేశానన్నారు. దుర్గబాబును ఈ సందర్భంగా స్థానికులు అభినందించారు.

గోదావరి గ్రామీణ బ్యాంక్ ద్వారా రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి

మలికిపురం: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ద్వారా రూ.13,655 కోట్ల రుణాలు ఇచ్చినట్లు బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ రామరాజులంక శాఖను ఖాతాదారుల సౌకర్యార్థం నూతన విశాల భవనంలోకి మారుస్తూ ఆ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ రెడ్డి మంగళవారం నూతన భవనం ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ ఈ బ్యాంకు 8 జిల్లాలో 275 శాఖలతో పనిచేస్తోందని అన్నారు. బ్యాంక్ డిసెంబర్ 2024 నాటికి రూ.11154 కోట్లు డిపాజిట్లు సేకరించింది. అప్పులుగా 13,655 కోట్లు ఇచ్చామన్నారు. రైతులకు స్వల్ప వడ్డీరేటుకు పంట రుణాలు మంజూరు చేస్తుందని, బంగారు ఆభరణాలు మీద ప్రతి రోజు గ్రాముకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యాలయం ప్రణాళికా అధికారి ఎన్.నరేంద్ర, శాఖా మేనేజర్ డి.శివరామిరెడ్డి, ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్, ఎన్.శ్రీనివాస్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం కోఆర్డినేటర్‌కు పలువురి అభినందన



గన్నవరపు శ్రీనివాసరావును అభినందిస్తున్న పార్టీ నాయకులు

అయినవిల్లి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్‌గా నియమితులైన అయినవిల్లి మండల జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావును మంగళవారం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రముఖులు కలసి అభినందనలు తెలిపారు. శంకరయగూడెం సర్పంచ్ బొక్కా కామేశ్వరరావు ఆధ్వర్యంలో గన్నవరపు శ్రీనివాసరావుకు పూలమాల, శాలువా వేసి సత్కరించారు. వీరితో పాటు వెలువలపల్లి గ్రామ సర్పంచ్ బొంతు మణి, ఎంపీటీసీ చల్లాబత్తుల సాయిలక్ష్మి, మాగం సర్పంచ్ కాశి వీవీ సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి తాటిపాక జోష్‌కుమార్ తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

నూతన శివాలయం పునర్నిర్మాణం

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలో దాతల విరాళాలు రూ.కోటితో ఉమా సోమేశ్వరస్వామి నూతన ఆలయాన్ని పునర్నిర్మించారు. శిథిలస్థితికి చేరిన ఆలయాన్ని సమూలంగా తొలగించి దాని స్థానే నూతన ఆలయం నిర్మించారు. ఈ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఈ నెల 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ మంగళవారం తెలిపింది. దీనిలో భాగంగా ఆలయం వద్ద ఐదు రోజుల పాటు పలు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు.

రేషన్ డీలర్ అభ్యర్థులకు నేడు, రేపు ఇంటర్వ్యూలు

కొత్తపేట: స్థానిక రెవెన్యూ డివిజన్ పరిధిలోని చౌక డిపో డీలర్ అభ్యర్థులకు ఈ నెల 22, 23 తేదీల్లో (బుధ, గురువారాల్లో) ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన, నూతనంగా ఏర్పాటు చేయనున్న 61 చౌకధరల దుకాణాలకు సంబంధించి శాశ్వత డీలర్ల నియామకానికి ఈ నెల 19న రాత పరీక్ష నిర్వహించగా 75 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. వారికి స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రెండు రోజుల పాటు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బుధవారం కొత్తపేట, పి.గన్నవరం, రావులపాలెం మండలాలకు చెందిన 42 మంది అభ్యర్థులకు, గురువారం అయినవిల్లి, ఆలమూరు, అంబాజీపేట, ఆత్రేయపురం మండలాలకు చెందిన 33 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆయా తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

ఆక్రమణలు తొలగించి రైతులను ఆదుకోండి

ఆలమూరు: జొన్నాడ నుంచి వెదురుమూడి వరకు వెంబడి ఉన్న కొత్త కాలువ ఆక్రమణలను తొలగించి రైతులను ఆదుకోవాలని చింతలూరు, ఆలమూరు సాగు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు, వైట్ల గంగరాజు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపిడిఓ ఎ.రాజు, తహసీల్దార్ కేజే ప్రకాష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. దీని వల్ల పంట కాలువలో పూడికతీత పనులు చేసేందుకు వీలు కలుగుతుందని, తద్వారా శివారు ప్రాంతాలకు సైతం సాగు నీరు అందించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. అలాగే మురుగు నీరు పంట కాలువల్లోకి వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి బాలఆధార్ నమోదు

ఆలమూరు: ఐదేళ్లలోపు వయసున్న చిన్నారులకు సంబంధించి ఆధార్ నమోదుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ ఎ.రాజు తెలిపారు. ఆయన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మితో కలసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో దశల వారీగా స్థానిక అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం నుంచి బాల ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఆయా అంగన్‌వాడీ సెంటర్లను సంప్రదించాలన్నారు.

సామరస్యంగా జాతరలు నిర్వహించుకోవాలి



కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

కొత్తపేట: ప్రశాంతంగా జరిగిన సంక్రాంతి ప్రభల ఉత్సవాలను ఆదర్శంగా తీసుకుని గ్రామాల్లో సామరస్యంగా అమ్మవార్ల జాతరలు, ఉత్సవాలు నిర్వహించుకోవాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఉత్సవ కమిటీలకు సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో శాంతి భద్రతలకు ఎక్కడా విఘాతం కలగకుండా జరిగిన సంక్రాంతి ప్రభల ఉత్సవాలు, ఇకపై జరగబోయే అమ్మవార్ల జాతరలు, ఉత్సవాలపై సమీక్షించారు. సీఐ విలేకరులతో మాట్లాడుతూ పోలీస్ సర్కిల్ పరిధిలో కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవానికి గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 5 లక్షల మంది జనం తరలివచ్చారన్నారు. అయినా ముందస్తుగా తీసుకున్న పోలీస్ బందోబస్తు చర్యలు, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సుమారు 400 మంది అదనపు పోలీసు సిబ్బందితో ఎక్కడికక్కడ గస్తీ ఏర్పాటుతో పాటు, ఉత్సవ కమిటీలు, ప్రజలు సహకారంతో ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. అందుకు సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కొత్తపేట, ఆలమూరు ఎస్సైలు జి.సురేంద్ర, ఎం.అశోక్ పాల్గొన్నారు.

'పొలమూరి'కి తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారం




తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకుంటున్న వెంకట్

అంబాజీపేట: సామాజిక అంశాలతో తన కవితల ద్వారా ప్రజలలో చైతన్యం కల్పిస్తున్నందుకు పొలమూరి వెంకట్‌కు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో కౌతా పూర్ణానంద విలాస్‌లో జరిగిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో పురస్కారాన్ని అంబాజీపేటకు చెందిన ప్రముఖ సామాజిక సహజకవి పొలమూరి వెంకట్‌కు సంస్థ సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అందజేశారు. వెంకట్‌ను పుర ప్రముఖులు, స్నేహితులు, అభిమానులు అభినందించారు. కొల్లి రమావతి, జి.ఈశ్వరి భూషణం, డా.టి.పార్థసారథి పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంక, సఖినేటిపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వపరంగా రైతులకు అమలు చేస్తున్న పథకాల గురించి మండల ఏవో నరసింహారావు వివరించారు. వరినాట్లు వేస్తున్న పొలాల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి ఆయన తెలిపారు. ప్రధానంగా ప్రస్తుత తరుణంలో కాండం తొలుచు పురుగు తెగులు, ఆకు ముడత తెగులు ఆశించినట్టు ఏవో అన్నారు. ఈ తెగులు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాము మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాగా పీఎం కిసాన్ పథకంలో లబ్ధి పొందుతున్న రైతులు, రైతు సేవాకేంద్రాల్లో ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తరువాత మాత్రమే ప్రభుత్వ లబ్ధి పొందేందుకు అర్హత వస్తుందన్నారు. వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలను అరికట్టాలి



ఆలమూరులో జరిగిన మండల ప్రజా పరిషత్ సమావేశంలో ప్రసంగిస్తున్న అధికారులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలను ఉన్నతాధికారులు అరికట్టాలని పలువురు ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ ఎ.రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి పథకం మండలంలో దుర్వినియోగం అవుతుందని చింతలూరు సాగు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి వైద్యురాలను నియమించి పేద మహిళలకు వైద్య సేవలు అందించాలని పినపళ్ల సర్పంచ్ సంగీత సుభాష్ కోరారు. సంధిపూడిలోని జగనన్న కాలనీకి విద్యుత్ సరఫరా చేయాలని సర్పంచ్ తోట భవాని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఎరువులను అందుబాటులో ఉంచాలని, అసంపూర్తిగా ఉన్న జల్‌జీవన్ పనులు పూర్తి చేయాలని, పలువురు సభ్యులు కోరారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీడీఓ, తహసీల్దార్లకు విజ్ఞప్తి చేశారు.